క్లుప్తంగా

22 కేంద్రాల్లో టెన్త్ పరీక్షలు

బాలాజీచెరువు: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రారంభం కానున్నాయి. నగరంలో 22 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి 5,380 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతున్నారు. ఈ పరీక్షలకు 300 మంది ఇన్విజిలేటర్లు నియమితులయ్యారు. అర్బన్ డీఐ వాణికుమారి, ఎంఈఓ చేవూరి రవి ఆధ్వర్యంలో పరీక్ష కేంద్రాల వద్ద సౌకర్యాలను పరిశీలించారు. పరీక్ష ఉదయం 9.30కు ప్రారంభమవుతుందని, అరగంట ముందుగా విద్యార్థులు కేంద్రానికి చేరాలని వారు సూచించారు.

30న రన్ ఫర్ జీసెస్

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఆలిండియా క్రిస్టియన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఈస్టర్ పండగను పురస్కరించుకుని ఈ నెల 30న రన్ ఫర్ జీసెస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఏఐసీసీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు రిక్కిగూటం ఆదివారం ఇక్కడ ఓ ప్రకటనలో తెలిపారు. కాకినాడ జిల్లా పరిధిలో నిర్వహించే ఈ రన్ ఉదయం ఆరు గంటలకు భానుగుడి జంక్షన్ నుంచి ప్రారంభమై, ఆనందభారతి గ్రౌండ్ వరకూ జరుగుతుందన్నారు. దీని పోస్టర్‌ను కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి కాకినాడలో జరిగిన కార్యక్రమంలో ఆవిష్కరించినట్టు తెలిపారు.

ఉచిత మెగా వైద్య శిబిరం


శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ సూర్యారావు

కరప: ప్రముఖ వైద్యులు ముమ్మిడి శ్రీరామారావు, నున్న నరసింహారావు జ్ఞాపకార్థం స్థానిక చిరంజీవి కల్యాణ మంటపంలో ఆదివారం ప్రవాసాంధ్ర వైద్య నిపుణుల సంఘానికి చెందిన ఎముకల వ్యాధి నిపుణుడు డాక్టర్ బొండా సూర్యారావు ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ముందుగా డాక్టర్ శ్రీరామారావు, డాక్టర్ నరసింహారావు చిత్రపటాలకు వైద్యులతో కలిసి, సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, వివిధ పార్టీల నాయకులు నివాళులర్పించారు. కరప, పరిసర గ్రామాల నుంచి సుమారు 800 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వివిధ విభాగాలకు చెందిన 14 మంది వైద్య నిపుణులు సేవలు అందించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు.


శాశ్వత ప్రాజెక్టులు చేపట్టాలి



కుట్టు మెషీన్లు అందజేస్తున్న సూర్యనారాయణ, బాలకృష్ణ

బాలాజీచెరువు: లయన్స్ క్లబ్ చేపట్టే సేవా కార్యక్రమాలు శాశ్వత ప్రాజెక్టులుగా ఉండాలని లయన్ జిల్లా గవర్నర్ వేలూరి సూర్యనారాయణ అన్నారు. లయన్స్ హాల్లో ఆదివారం జరిగిన కార్యక్రమానికి క్లబ్ కాకినాడ అధ్యక్షుడు రామసుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా విశ్వనాథపల్లి సత్యవేణి, రేకాడి రమణికి కుట్టు మెషీన్లు ఉచితంగా అందజేశారు. అలాగే రెయిన్‌బో చిల్డ్రన్ హోమ్‌కు మిక్సీ అందించారు. క్లబ్ జిల్లా పూర్వ గవర్నర్ డాక్టర్ బాదం బాలకృష్ణ, దంగేటి సతీష్, బాదం కుసుమ పాల్గొన్నారు.

నీడ ఇచ్చిన విడోస్ హోమ్

నేడు పైండా రామకృష్ణయ్య వర్ధంతి


కుట్టు శిక్షణ పొందుతున్న మహిళలు


పైండా రామకృష్ణయ్య(ఫైల్)

బోట్‌క్లబ్: నిలువ నీడ లేని రోజుల్లో వితంతువుకు విడోస్ హోమ్ చోటు కల్పించింది. ఆ దాత ఆశయాలకు అనుగుణంగా మహిళలు నేడు స్వయం ఉపాధి సాధించేలా ఉచిత కుట్టు శిక్షణ పొందుతున్నారు. కాకినాడ మెయిన్ రోడ్డులోని విడోస్ హోమ్‌ను పైండా రామకృష్ణయ్య జమీందారు 1898లో ఏర్పాటు చేశారు. కాలక్రమేణా శిథిలమైన ఈ హోమ్‌ను దేవాదాయ శాఖ పరిధిలోకి తీసుకుంది. దాత ఆశయాలకు అనుగుణంగా సేవా కార్యక్రమాలు చేయాలనే దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆదేశాల మేరకు రెండేళ్లుగా మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ ప్రారంభించారు. రోజుకు రెండు బ్యాచ్‌లలో శిక్షణ ఇస్తున్నారు. ఒకొక్క బ్యాచ్‌కు మూడు నెలల పాటు శిక్షణ కొనసాగుతోంది. దాత ఆశయాలకనుగుణంగా సేవా కార్యక్రమాలు చేస్తున్నామని విడోస్ హోం చైర్మన్ పైండా రామకృష్ణారావు తెలిపారు. శిక్షణానంతరం వితంతువులకు కుట్టుమెషీన్లు అందిస్తున్నామన్నారు. సోమవారం పైండా రామకృష్ణయ్య వర్ధంతి సందర్భంగా స్థానిక సాంబమూర్తినగర్‌లోని మహర్షి బులుసు సాంబమూర్తి దివ్యాంగుల పాఠశాల విద్యార్థులకు దుప్పట్లు, నిత్యావసర వస్తువులు పంపిణీ చేయనున్నట్టు తెలిపారు.

ఎరువు.. కారాదు బరువు

- అవసరం మేరకే వాడాలంటున్న నిపుణులు
- విచక్షణారహితంగా వినియోగించ వద్దు
- చీడపీడలు తప్పవని హెచ్చరిక


కరప మండలంలో దాళ్వా వరి పైరు

కాకినాడ సిటీ: పంట దిగుబడిని పెంచడంలో ఎరువుల పాత్ర కీలకం. సార్వా కంటే దాళ్వాలో రైతులు ఎక్కువగా ఎరువులు వినియోగిస్తారు. వరి పైరులో అవసరమైన మేరకే ఎరువులు వినియోగించాలని వ్యవసాయ నిపుణులు రైతులకు సూచిస్తున్నారు. అధిక దిగుబడి సాధించాలనే తపనతో రైతులు మితిమీరి ఎరువులు వేయడం వల్ల చీడపీడలు విజృంభించే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

కాకినాడ రూరల్, అర్బన్ ప్రాంతాల్లో సుమారు 14,300 ఎకరాల్లో దాళ్వా వరి సాగును రైతులు చేపట్టారు. ప్రతి పంటకు నత్రజని, భాస్వరం, పొటాష్ వంటి సూక్ష్మ పోషకాలతో పాటు, జింక్, మెగ్నీషియం, బోరాన్, కాల్షియం, సల్ఫర్ వంటి ఇతర పోషకాలు కూడా చాలా అవసరం. ప్రస్తుతం రైతులకు రసాయన ఎరువుల వినియోగంపై సరైన అవగాహన లేకపోవడం, రైతుల మధ్య పోటీ తత్వం కారణంగా అవసరానికి మించి ఎరువులు వాడుతున్నారు. దీంతో సాగు ఖర్చులు విపరీతంగా పెరిగి పోవడంతో పాటు, చీడపీడలు విజృంభించి జింక్, ఇనుము వంటి సూక్ష్మపోషక లోపాలు ఎక్కువ కావడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. ఇటువంటి తరుణంలో వివిధ రకాల ఎరువుల్లో ఉన్న పోషకాల మోతాదు, వాటి ఉపయోగాలు, ఎరువులు వేయాల్సిన సమయంపై రైతులకు తప్పనిసరిగా అవగాహన ఉండాలి.

ఎకరా వరికి ఏం అవసరమంటే..

ఎకరా వరికి 72 కిలోల నత్రజని, 36 కిలోల భాస్వరం, 24 కిలోల పొటాష్ ఇచ్చే ఎరువులు అవసరం. ఎకరం విస్తీర్ణంలో వరికి మొదటి దఫా సిఫార్సు చేసిన మొత్తం భాస్వరాన్ని దమ్ములో వేసుకోవడం వల్ల త్వరగా మూన తిరిగి దుబ్బు ఎక్కువగా చేస్తుంది. నత్రజని ఎరువును మూడు సమ భాగాలుగా చేసి, మొదటి దఫా నాట్లు వేసే సమయంలోను, రెండో దఫా పిలకలు కట్టే దశలోను, చివరి దఫా అంకురం దశలోను వేసుకోవాలి. పొటాష్ ఎరువును రెండు భాగాలుగా చేసి, తొలి దఫా నాట్లు వేసే సమయంలో, మిగిలిన సగం అంకురం ఏర్పడే దశలో వేయాలి. సూటి ఎరువుల రూపంలో ఎకరాకు 157 కిలోల యూరియా, 200 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 40 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ అవసరమవుతాయి.

నత్రజని ఎరువు వాడకం ఇలా..

నత్రజని ఎరువు సమర్థంగా పని చేయాలంటే, బురద పదునుపై చల్లి.. 48 గంటల తర్వాత నీరు పెట్టాలి. 50 కిలోల యూరియాకు పది కిలోల వేప పిండి లేదా 250 కిలోల తేమ కలిగిన మట్టి కలిపి రెండు రోజులు నిల్వ ఉంచిన తర్వాత పొలంలో చల్లడం వల్ల నత్రజని వినియోగం పెరిగి, మొక్క దృఢంగా మారుతుంది.

సూక్ష్మ పోషక లోపాలు

ప్రధానంగా జింక్ లోపం వల్ల నాట్లు వేసిన తర్వాత మొక్కపై నుంచి 3 లేదా 4 ఆకుల మధ్య ఈనె తెల్లగా పాలిపోతుంది. మధ్య ఈనె ముందుగా ఆకుపచ్చ నుంచి పసుపు, తర్వాత తెలుపు రంగుకు మరుతుంది. జింక్ లోపం ఆశించిన ఆకులు చిన్నగా, పెళుసుగా ఉండి, వంచగానే శబ్దం చేస్తూ విరిగిపోతాయి. జింక్ లోపం నివారణకు నాట్లు వేసిన 2-5 వారాల మధ్య పొలంలో పాత నీటిని తీసివేసి, కొత్తగా పెట్టాలి. లీటరు నీటికి 2 గ్రా. జింక్ సల్ఫేట్ కలిపి పైరంతా తడిచేలా పిచికారీ చేయాలి. ఐదు రోజుల వ్యవధిలో రెండు, మూడు పర్యాయాలు పిచికారీ చేయడం వల్ల లోపాన్ని పూర్తిగా నివారించవచ్చు.

ఇనుప ధాతు లోపం

సాధారణంగా సున్నం ఎక్కువగా ఉండే నేలల్లో, నారుమడులు మేట వేసే ప్రాంతాల్లో, అధిక వర్షాలు కురిశాక.. నీరు నిలిచిన పొలాల్లో ఇనుప ధాతు లోపం ఎక్కువగా కనిపిస్తుంది. దీంతో ముందుగా లేత ఆకుల ఈనెల మధ్య భాగం పసుపు రంగుకు మారి, క్రమేపీ ఆకు అంతా తెల్లగా మారి, ఎండిపోతుంది. దీని నివారణకు లీటరు నీటికి 20 గ్రా. అన్నభేది, 2 గ్రా. నిమ్మ ఉప్పు కలిపి రెండు, మూడు పర్యాయాలు పిచికారీ చేయాలి.

దిగుబడులపై ప్రభావం



దాళ్వా పంటలో రైతులు ఎక్కువ దిగుబడి సాధించాలని ఎరువులను ఎక్కువగా వినియోగించడం వల్ల లాభం కంటే నష్టమే ఎక్కువ. ఎరువుల అధిక వినియోగం వల్ల ఖర్చు పెరగడమే కాక, చీడపీడలు ఆశించి దిగుబడులు తగ్గిపోయే ప్రమాదముంది. వ్యవసాయ శాఖాధికారుల సూచనల మేరకు ఎరువులు వినియోగిస్తే రైతులకు ప్రయోజనకరంగా ఉంటుంది.

– ఎ.వి.రాజేష్, మండల వ్యవసాయాధికారి, కరప

నేత్రదానంతో మరో ఇద్దరికి వెలుగు

జేఎన్‌టీయూకే వీసీ ప్రసాదరాజు


మాట్లాడుతున్న జేఎన్‌టీయూకే వీసీ ప్రసాదరాజు

కాకినాడ: ఒకరి నేత్రదానం మరో ఇద్దరికి వెలుగు ఇస్తుందని జేఎన్‌టీయూకే వైస్ ఛాన్సలర్ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు అన్నారు. స్థానిక రెడ్‌క్రాస్ సంస్థ ఆవరణలో నేత్రనిధికి నేత్రాలను దానం చేసేందుకు పేర్లు నమోదు చేసుకున్న వారితో ఆదివారం నేత్రదాన ప్రతిజ్ఞ చేయించారు. గవర్నర్ అబ్దుల్ నజీర్ ఇటీవల నేత్రనిధిని ప్రారంభించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో నేత్రదానం కోసం పేర్లు నమోదు చేసుకున్న తొలి 50 మందితో ఆదివారం ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వీసీ ప్రసాదరాజు మాట్లాడుతూ నేత్రనిధి ద్వారా అంధుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రయత్నిస్తున్న రెడ్‌క్రాస్ సంస్థను అభినందించారు. జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ వైడీ రామారావు మాట్లాడుతూ సమాజంలో నేత్రదానంపై మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జేఎన్‌టీయూకే ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ పి.శ్యామ్‌కుమార్, రెడ్‌క్రాస్ కార్యదర్శి కె.శివకుమార్, నేత్రనిధి గౌరవ వైద్యాధికారి డాక్టర్ ఎస్‌వీ రావు, కార్యవర్గ సభ్యులు పి.భావన ప్రసాద్, ఎస్.భానుమతి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రవర్తన నియమావళి పాటించాలి

రాజకీయ పార్టీలకు ఆర్ఓ జె.వెంకటరావు సూచన


నోడల్ అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న ఆర్ఓ వెంకటరావు

కాకినాడ: ఎన్నికల షెడ్యూల్ విడుదలైనందున అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రవర్తన నియమావళిని కచ్చితంగా పాటించాలని కాకినాడ సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు కోరారు. ఆదివారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఎన్నికల అధికారులు, నోడల్ ఆఫీసర్లతో ఆదివారం సమావేశమై, పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆర్ఓ మాట్లాడుతూ షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అమల్లోకి వచ్చిందన్నారు. రాజకీయ పార్టీలకు సంబంధించిన హోర్డింగులు, జెండాలు, బిల్ బోర్డులు, గోడలపై ప్రచారాలు పూర్తి నిషిద్ధమన్నారు. రాజకీయ నాయకులకు సంబంధించిన విగ్రహాలు కప్పి వేస్తామన్నారు.24 గంటల వ్యవధిలో మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ బృందాలు ఈ ప్రక్రియను పూర్తి చేస్తాయన్నారు. తర్వాత ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాల్లో ప్రచారాలకు అనుమతి లేదని, ప్రైవేట్ స్థలాల్లో ఏర్పాటు చేసుకోవాలనుకుంటే, సంబంధిత భవన యజమాని రాతపూర్వక అనుమతితో మాత్రమే ప్రచారం చేసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. అలాగే ర్యాలీలు, సభలు నిర్వహించాలనుకుంటే ముందుగా ఆర్ఓ నుంచి రాతపూర్వక అనుమతి తీసుకోవాలని పేర్కొన్నారు. అనుమతి లేకుండా సభలు, సమావేశాలను అనుమతించబోమని స్పష్టం చేశారు. ఈ విషయంలో అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని ఆర్ఓ కోరారు.

పటిష్టంగా ఎన్నికల నిర్వహణ

ఎన్నికల కమిషన్ ఆదేశాలను కచ్చితంగా పాటిస్తూ మే 13న జరగనున్న లోక్ సభ, శాసన సభ ఎన్నికలను పటిష్టంగా నిర్వహించడంలో సంబంధిత నోడల్ అధికారులు ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని కాకినాడ సిటీ నియోజకవర్గ ఆర్ఓ జె.వెంకటరావు ఆదేశించారు.

స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో ఎన్నికల నిర్వహణపై ఆదివారం నోడల్ ఆఫీసర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణను 22 బృందాలుగా విభజించి, వాటి పర్యవేక్షణ బాధ్యతను నోడల్ అధికారులకు అప్పగించామన్నారు.

ఆయా బృందాలు ఎన్నికలకు సమాయత్తం కావడంతో పాటు, చేపట్టాల్సిన విధులు, బాధ్యతలపై అవగాహన పెంచుకుని, ఎన్నికలు సజావుగా జరిగేలా పని చేయాలన్నారు. సమావేశంలో నగర పాలక సంస్థ ఎస్ఈ పి.సత్య కుమారి, డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, తహసీల్దార్ దొర, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ సీతాపతిరావు, మేనేజర్ కర్రి సత్యనారాయణ, ఈఈ మాధవి, ఏఓ శిరీష్, పలువురు డీఈలు, ఏఈలు, నోడల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

జగన్ వన్స్ మోర్ అంటున్న ప్రజలు

- ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు చలమలశెట్టి, ద్వారంపూడి
- టీడీపీ, జనసేన నుంచి 150 మంది పార్టీలో చేరిక


వైఎస్సార్ సీపీలో చేరిన వారిని ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి, ఎంపీ అభ్యర్థి సునీల్

కాకినాడ: ఐదేళ్ల పాలనలో ఎన్నో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని జగన్ వన్స్ మోర్ అంటూ అన్ని వర్గాల ప్రజలూ స్వాగతిస్తున్నారని వైఎస్సార్ సీపీ కాకినాడ పార్లమెంటరీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. జనసేన, టీడీపీల్లో క్రియాశీలకంగా ఉన్న 11, 12 డివిజన్లకు చెందిన సుమారు 150 మంది ఆదివారం చలమలశెట్టి, ఎమ్మెల్యే ద్వారంపూడి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. చలమలశెట్టి నివాసంలో పార్టీ ఎస్సీ నాయకులు బళ్ల సూరిబాబు, బొండాడ అదృష్ట దీపక్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ద్వారంపూడి, సునీల్ మాట్లాడుతూ రాజకీయ స్వార్థంతో, అధికారమే లక్ష్యంగా, సరైన అజెండా లేకుండా ఒక్కటైన టీడీపీ, జనసేన తీరుపై ఆయా పార్టీల క్యాడర్‌లో తీవ్ర అసంతృప్తి నెలకొందన్నారు. కుల, మత, రాజకీయాలకతీతంగా ప్రజల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో సేవలందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విధానాలకు ఆకర్షితులై ఆయా పార్టీల నుంచి పెద్దఎత్తున వైఎస్సార్ సీపీలో చేరుతున్నారన్నా రు. పార్టీలో చేరేందుకు ముందుకు వచ్చిన వారికి చలమలశెట్టి, ద్వారంపూడి కండువాలు వేసి, పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి, పార్టీ విజయమే లక్ష్యంగా కష్టపడి పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కాకినాడ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి భత్తుల భీమారావు, నాయకులు మల్లి, తాతారావు, మూర్తి పాల్గొన్నారు.

సాకారం కానున్న శెట్టిబలిజల కల

ఎమ్మెల్యే ద్వారంపూడికి సంఘ పెద్దల కృతజ్ఞతలు


ఎమ్మెల్యే ద్వారంపూడిని కలిసిన శెట్టిబలిజ సంఘ నాయకులు

కాకినాడ: జిల్లా కేంద్రంలో శెట్టిబలిజ కులస్తుల కోసం కమ్యూనిటీ హాల్ నిర్మించుకోవాలన్న దశాబ్దాల కలను సాకారం చేసే దిశగా తోడ్పాటునందించిన సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డికి జిల్లా శెట్టిబలిజ సంక్షేమ సంఘం కృతజ్ఞతలు తెలియజేసింది. శెట్టిబలిజ సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు గెద్దాడ వెంకటేశ్వరరావు, ఇతర సంఘ పెద్దలు ఆదివారం ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. జీవో ఎంఎస్ నంబర్ 140 తేదీ 16-3-2024 ద్వారా కాకినాడ డెయిరీ ఫారం సెంటర్ సమీపంలోని రెవెన్యూ కాలనీ వద్ద 630 గజాల స్థలాన్ని కేటాయించడంపై ధన్యవాదాలు చెప్పారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్షుడు గెద్దాడ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తమ చిరకాల వాంఛగా ఉన్న కమ్యూనిటీ హాల్ నిర్మాణ కల ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి చొరవతో సాకారం కాబోతోందన్నారు. ఎన్నో దశాబ్దాలుగా, ఎంతోమంది రాజకీయ నాయకులను కలిసి వేడుకున్నప్పటికీ స్థల కేటాయింపు జరగలేదన్నారు. సంఘం తరపున తామిచ్చిన లేఖపై స్పందించిన ద్వారంపూడి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణు సహకారంతో ఎంతో శ్రమించి, ఉత్తర్వులు విడుదల చేయించారని చెప్పారు. సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ త్వరలోనే భవన నిర్మాణం కూడా పూర్తికావాలని, అందుకు తనవంతు తోడ్పాటు అందిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో జెడ్పీటీసీ గుబ్బల తులసీ కుమార్, శెట్టిబలిజ ప్రముఖులు పితాని నూకరాజు, రెడ్డి రామ పల్లంరాజు, అంజి బాబు తదితరులున్నారు.

జగన్‌పై నమ్మకంతోనే చేరికలు


రమణయ్యపేట క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కన్నబాబు సమక్షంలో చేరిన మహిళలు


సూర్యారావుపేట లైట్‌హౌస్‌పేట నుంచి చేరిన వారితో ఎమ్మెల్యే కురసాల


కొవ్వాడ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరిన వారితో ఎమ్మెల్యే

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- పెద్దఎత్తున మహిళలు, మత్స్యకార పెద్దల చేరిక

కాకినాడ రూరల్: దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలను సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేసి మహిళా సాధికారతకు అర్థం చెప్పారని, ఆయనపై నమ్మకంతో టీడీపీ, జనసేన నుంచి పెద్దఎత్తున వైఎస్సార్ సీపీలోకి చేరుతున్నారని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. రమణయ్యపేట వైద్యనగర్ క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఉదయం కాకినాడ 50వ డివిజన్‌కు చెందిన సుమారు వంద మంది టీడీపీ, జనసేన నుంచి మాజీ కార్పొరేటరు ఐ.శ్రీను ఆధ్వర్యంలో సత్య కొటారి, కృష్ణా సమీరా, దొమ్మేటి సత్యవతి, అనుసూరి కృష్ణవేణి, పితాని సత్యవతి, గుత్తుల నాగరత్నం, మేడిశెట్టి చక్రలక్ష్మి, వెంకటలక్ష్మి, గరగ లక్ష్మి, వరలక్ష్మి, సతీష్, సందీప్ తదితరులు ఎమ్మెల్యే కన్నబాబు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే కండువాలు వేసి, సాదరంగా ఆహ్వానించారు. అర్బన్ డివిజన్ల క్లస్టరు ఇన్‌చార్జి కడియాల చిన్నా తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు వాకలపూడి గ్రామానికి చెందిన మత్యకార పెద్దలు పార్టీ గ్రామ నాయకులు గొల్లపల్లి కాశీ, గంపల సత్యనారాయణ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. మత్స్యకారులు, వాడబలిజ పెద్దలు గొల్లపల్లి పెద్దఅప్పారావు, సీకోటి సింహాచలం, వాడపల్లి పెద్ద అప్పారావు, దూడా కాశీయ్య, గంపల అబ్బాయి తదితరులకు వైఎస్సార్ సీపీ కండువాలను వేసి ఎమ్మెల్యే వారిని సాదరంగా ఆహ్వానించారు.

ఆయన మాట్లాడుతూ ఏ సమస్య వచ్చినా తాము అండగా ఉంటామన్నారు. వచ్చే ఎన్నికల్లో గతంకంటే మెరుగైన ఫలితాలు సాధించాలని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, పార్టీ మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జి జమ్మలమడక నాగమణి, నల్ల శ్రీను, రాణి తదితరులు పాల్గొన్నారు.

లైట్‌హౌస్‌పేట, కొవ్వాడ నుంచి భారీగా చేరికలు

మండలంలోని సూర్యారావుపేట లైట్ హౌస్ పేటకు చెందిన మత్స్యకారులు, కొవ్వాడ గ్రామానికి చెందినవారు వైఎస్సార్ సీపీలో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సమక్షంలో ఆదివారం రాత్రి చేరారు. రమణయ్యపేట క్యాంపు కార్యాలయం వద్ద లైట్ హౌస్‌పేటకు చెందిన దూడ రవి, గుర్రాల రాము, దూడ అప్పారావు, గరికిన రమణ తదితరులు సుమారు 150 మంది టీడీపీ, జనసేన నుంచి చేరడంతో, వారికి పార్టీ కండువాలను వేసి ఎమ్మెల్యే కన్నబాబు స్వాగతించారు. కార్యక్రమంలో సూరాడ రాజు, గొల్లపల్లి కాశీ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కొవ్వాడకు చెందిన సీనియర్ నాయకుడు గోపుశెట్టి బాబ్జీ, ఉప సర్పంచ్ తోటకూర శ్రీనివాసు తదితరుల ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన నుంచి పోలేటి రాజు, అనుసూరి నవీన్, ఊబా రాజు, కణితి అజయ్ తదితరులు 50 మంది చేరారు. వీరికి ఎమ్మెల్యే కన్నబాబు పార్టీ కండువాలు వేసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కురసాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల ఉద్యమానికి మద్దతు

- ఓఎన్‌జీసీ పరిహారం అందేలా కృషి
- వాకలపూడిలో ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: కాకినాడ తీర ప్రాంతంలో క్రూడాయిల్ వెలికితీత కోసం ఓఎన్‌జీసీ ఆంక్షల నేపథ్యంలో ఆందోళనలో ఉన్న మత్స్యకారులు ఉద్యమం బాట పట్టిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో వాకలపూడికి చెందిన సుమారు 400 మంది మత్స్యకారులు రమణయ్యపేట క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కురసాల కన్నబాబును కలిసి తమకు న్యాయం చేయాలని అభ్యర్థించారు. తమ జీవనోపాధికి భంగం వాటిల్లేలా ఓఎన్‌జీసీ ఆంక్షలు విధించేలా ఉందని, పరిహారం అందించేందుకు అండగా నిలవాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నబాబు మాట్లాడుతూ కాకినాడలో మత్స్యకారులు ఆందోళనకు తనతో పాటు, సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, ఎంపీ వంగా గీత, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మద్దతు ఇచ్చి, ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లామన్నారు. కాకినాడ మత్స్యకారులతో పాటు, రూరల్ నియోజకవర్గంలోని సూర్యారావుపేట, లైట్ హౌస్, వాకలపూడి, పగడాలపేట, ఉప్పలంక తదితర గ్రామాలకు చెందిన మత్స్యకారులు కమిటీలో ఉంటారన్నారు. కాకినాడ తీరంలో ఓఎన్‌జీసీ సర్వే ప్రాంతంలో 35 కి.మీ. మేర నిషేధంతో పాటు, 500 కి.మీ. మేర చేపల వేట సాగించరాదనే ఆంక్షలున్నట్టు తెలిసిందని, ఇదే జరిగితే మత్స్యకారుల జీవనోపాధికి విఘాతం కలుగుతుందన్నారు. మత్స్యకారులకు పరిహారం అందేలా రాజకీయాలకతీతంగా మద్దతు తెలుపుతున్నామన్నారు. వారికి మంచి జరిగేలా చూస్తామన్నారు. వేట నిషేధ భృతి అందుకుంటున్న వారికీ పరిహారం అందే అవకాశం ఉంటుందన్నారు. మత్స్యకార నాయకులు పెద అబ్బాయి, సింహాద్రి, అప్పారావు, కాసయ్య, కాశీ, జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు గొల్లపల్లి జగన్, కాశీ, గంపల సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

స్పందన, డయల్ యువర్ కమిషనర్ రద్దు

కాకినాడ: సోమవారం జరగాల్సిన డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాలను రద్దు చేసినట్టు కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అమల్లోకి వచ్చినందున ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. నగర ప్రజలు ఈ విషయాన్ని గమనించాల్సిందిగా కమిషనర్ కోరారు.

కోడ్ వచ్చినా.. తొలగని హోర్డింగులు

కరప: ఎన్నికల కోడ్ అమలుల్లోకి వచ్చినా మండలంలో జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి ఫ్లెక్సీలు, హోర్డింగులు తొలగించలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన 24 గంటల్లోగా ప్రభుత్వ, పబ్లిక్, ప్రైవేటు స్థలాల్లో ఉన్న రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, హోర్డింగులు తొలగించాలని, ప్రభుత్వ కార్యాలయాల్లో ఉండే పీఎం, సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేల ఫొటోలు, ఫ్లెక్సీలు తొలగించాలని, రాజకీయ నేతల విగ్రహాలకు ముసుగులు వేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. అనేకచోట్ల అధికారులు స్పందించి, ఈ మేరకు చర్యలు తీసుకున్నారు, వైఎస్సార్ సీపీ నాయకులు తమ ఫ్లెక్సీలు, హోర్డింగులు తొలగించారు. అయితే జనసేన నాయకులు ఆర్అండ్‌బీ స్థలాల్లో రోడ్డు మార్జిన్లలో ఏర్పాటు చేసిన హోర్డింగులు, ఫ్లెక్సీలు తొలగించకపోవడంపై ప్రజలు మండిపడుతున్నారు. ఆర్అండ్‌బీ అధికారుల అనుమతులు కూడా తీసుకోకుండానే కాకినాడ–రామచంద్రపురం, పెనుగుదురు–కోటిపల్లి రోడ్డులో వారం క్రితమే జనసేన నేతలు హోర్డింగులు ఏర్పాటుచేశారు. దీనిపై ఆర్అండ్‌బీ డీఈఈ వర్మను వివరణ కోరగా, తమ శాఖ ఎవరికీ అనుమతి ఇవ్వలేదన్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున సంబంధిత అధికారులే చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు.

పార్టీల ఫ్లెక్సీలు, బ్యానర్ల తొలగింపు



బ్యానర్లు, ఫ్లెక్సీలు తొలగిస్తున్న సిబ్బంది

కాకినాడ: ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చిన నేపథ్యంలో కాకినాడ సిటీ నియోజకవర్గ పరిధిలోని వివిధ రాజకీయ పార్టీలకు సంబంధించిన బ్యానర్లు, పోస్టర్లు, ఫ్లెక్సీల తొలగింపు ప్రక్రియ ప్రారంభమైంది. రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు ఆదేశాల మేరకు డిప్యూటీ సిటీప్లానర్ హరిదాస్ పర్యవేక్షణలో సిబ్బంది ఈ తొలగింపు ప్రక్రియ చేపట్టారు. నగరంలోని ఆయా సచివాలయ అడ్మిన్ల పర్యవేక్షణలో డివిజన్ల వారీగా గోడలపై ఉన్న పోస్టర్లు, ఫ్లెక్సీలు, బ్యానర్లను తొలగిస్తున్నారు. ఈ ప్రక్రియను నగర పరిధిలో మూడు ప్రత్యేక బృందాలు పర్యవేక్షిస్తున్నాయి. ఎక్కడైనా ఇబ్బందులుంటే మోడల్ కోడ్ ఆఫ్ కాంటాక్ట్‌కు సంబంధించిన బృందాలు జోక్యం చేసుకుని, నియమావళికి అనుగుణంగా ఈ ప్రక్రియను పూర్తి చేస్తున్నాయి. ఈ సందర్భంగా డీసీపీ హరిదాసు మాట్లాడుతూ కాకినాడ సిటీ నియోజకవర్గ పరిధిలో చాలావరకు ప్రచార పోస్టర్లు, బ్యానర్లు, హోర్డింగులను తొలగించామని చెప్పారు. జాతీయ నాయకులు మినహా, రాజకీయ పార్టీల నాయకులకు సంబంధించిన విగ్రహాలకు మాస్కులు వేస్తున్నామన్నారు. నగర పరిధిలో సుమారు 50 విగ్రహాలు ఉంటాయన్నారు. రాజకీయ పార్టీలు కూడా మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌ను కచ్చితంగా అమలు చేయడంలో సహకరించాలని కోరారు.